# అంతా బాగానే వుంది...



చింతచెట్ల కింద పందులు బురదలో ఈదుతున్నాయి. చాకళ్ళు మురికి బట్టలు ఆపకుండా ఉతుకుతున్నారు. ఉప్పర్లు చెమట కక్కుకుంటూ రాళ్ళు పగలగొడుతున్నారు. పట్టించుకోని సూర్యుడు పైకి, పై పైకి వెళ్ళిపోతున్నాడు. విన్పించుకోని చంద్రుడు, చుక్కలు రాత్రుళ్ళు సరసమాడుకుంటున్నాయి. అంతా బాగానే ఉన్నట్టుంది.

గుడిసెలో అరవైయేళ్ళ జోగయ్య చుట్ట ఆరిపోతే అగ్గిపుల్లయిపోతే, పొయ్యి దగ్గరకెళ్ళి నిప్పంటించుకొచ్చి వీధిలోకి కళ్ళు నిగిడ్చి చూస్తున్నాడు. అదే చూపు. చూపు సాగినంత మేర కన్నార్పకుండా చూపు. ఆ ఎదురు చూపు ముప్పయేళ్ళనాటిది. అప్పటికి తన ఐదేళ్ళ కొడుకు తోటివాళ్ళతో కిష్టకి స్నానానికి వెళ్ళి తిరిగి రాలేదు. 'కిష్టలో నీళ్ళు లేవు. నడిచి అవతలొడ్డుకెళ్ళి ఆడుకుని వచ్చాం. తిరిగి వచ్చేటప్పుడు కన్పించలేదు' అన్నారు మిగతా పిల్లలు. వూరంతా వెతికారు. కన్పించలేదు. కొట్టుకుపోయాడేమోనని రేవులన్నీ వెతికారు. జాడలేదు. 'తప్పిపోతే ఎవరో ఏవూళ్ళోనో నాల్రోజులుంచుకుని తీసుకొస్తార్లే' అనుకున్నారు. నెలయింది. ఏడాదయింది. ముప్పై ఏళ్ళయింది. తిరిగి రాలేదు. అప్పటినుంచి జోగయ్యకు అదేచూపు. కొంతకాలం అన్నం తింటూ పక్కనలేని కొడుకునోటికి ముద్దలందించేవాడు. నడుం వంగిపోయినా కళ్ళు వాలిపోయినా కొడుక్కోసం

చూపునిటారుగానే వుంది.

జోగయ్య పెళ్ళాం వీరమ్మకి కళ్ళు మసకలొచ్చినై. చూపు ఆనదు. కళ్ళు దించుకుని ఆలోచిస్తోంది. "ఆడియ్యాలుంటే పెళ్ళయిపోను గదా! ఆడికి పిల్లో పిల్లోడో పుడ్తే ఉయ్యాల ఈ గుంజకే వేస్తాను కదా! ఈ లాలిపాట పాడుతూనే ఉయ్యాల వూపుతానుకదా ! కోడలు పిల్ల మళ్ళీ నీళ్ళోసుకుంటే 'పనిలోకి రాకే' అని ఇట్లాగే గసురుకుంటా గదా! పెళ్లాం గట్టిగా గసురుకోటం విన్న జోగయ్య "ఏవిటే" అనడిగితే అవమానం పడిపోయిన వీరమ్మ కళ్ళు దించేసుకుంది. వాళ్ళ మధ్య మాటలు లేవు. రెండు గుండెల్లోను కొడుకు కోడలూ మనవలూను.

ఆ పక్క పెంకుటింట్లో ముప్పైఏళ్ళు వచ్చినా మంగళసూత్రం ఎరగని ముద్దరాలు సుబ్బి. కిటికీలోంచి వచ్చే పోయేవాళ్ళనందర్నీ దిగులుగా చూస్తూ వుంటుంది. తన ఈడువారికందరికీ పెళ్ళిళ్ళయిపోయాయి. ఇద్దరు ముగ్గురుపిల్లల్ని కన్నారు. బాలింతలుగా ఊరేగింపుగా వెళ్ళి కృష్ణనించి బిందె ముంచుకొచ్చారు. పేరంటాల్లో పిల్లలు అల్లరిచేస్తే విసుక్కునివాళ్ళనికొట్టి, వాళ్ళేడిస్తే "నాతల్లే నా అమ్మే! నేను చచ్చిపోను" అని గుండెలకి హత్తుకున్నారు. తన కెవ్వరూ లేరు.

కట్నం లేంది పెళ్ళవదు. తండ్రి ఇవ్వలేడు. పెళ్ళికీ పేరంటాలకీ వెడితే అందరూ తన వైపు వింతగా చూస్తారు. వెనక అమ్మ రోజూ గుళ్ళోకయినా పంపించేది. ఇప్పుడు ఇల్లు కదలనివ్వటం లేదు. చుట్టుపక్కల పిల్లల్ని పోగుచేసి తను వాళ్ళకి తల్లి అయినట్టు భావించుకుని, వాళ్ళని ఆడించి పాడించి ఏడిపించి కావిలించుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంది సుబ్బి.

పక్కింటి బడిపంతులు, కొడుకు ఘర్షణ పడుతున్నారు. పదహారేళ్ళ కొడుకు పట్నం వెళ్ళి తోటివాళ్ళతో సినిమా చూస్తాను ఐదురూపాయలిమ్మన్నాడు. అన్నం తింటున్న పంతులికి ఇబ్బందయింది. అతని దగ్గర డబ్బు లేదు. అమ్మనడిగాడు. అయ్యనడగమంది. అయ్యనడిగితే నా దగ్గర లేవన్నాడు. వొత్తిడి చేశాడు. తండ్రి విసుక్కున్నాడు. కొడుకు చిర చిర లాడాడు. నేల తన్ని విసవిస బైటికొచ్చాడు. పంతులికి చెడ్డకోపమొచ్చి సగం అన్నంలో చేయి కడిగేసుకుని 'ఒరేయ్' అని గావుకేక పెట్టాడు. కొడుకు తన్ని అవమానించినట్టు అగౌరవపరచినట్టు

అనిపించగా కోపం పెల్లుబికింది. 'ఒరేయ్ నువ్వు అడిగింది అడిగినట్టు ఇస్తేనే అమ్మా అయ్యాను. లేకపోతే కారు. మా అప్పులు మా బాధలూ నీకేమీ అక్కర్లా. పోరా పో. వెళ్ళు' అనరిచాడు. కొడుకు వెళ్ళిపోయింతర్వాత పెళ్ళాంతో అన్నాడు 'అవునే మనం వాడి సరదాలు తీర్చలేం. డబ్బు లేదు. ఇలాంటి దౌర్భాగ్యుల కడుపున పుట్టాడు. అనుభవిస్తున్నాడు.' అంటూ బయటికి వెళ్ళిపోయాడు. బయటికి వెళ్ళిపోతున్న భర్తని, వదిలేసిన అన్నాన్ని చూసి గుడ్లనీరు గుడ్ల కుక్కుకుంది ఇల్లాలు.

గుళ్ళో బాకా సాయెబు బాకా వూదలేకపోతున్నాడు. అతని గొంతులో పుండయింది. శబ్దం రావటం లేదు. ఉదయ సంధ్యల్లో ఖఁయ్‌ని బాకావూది వూరంతని మేల్కొలిపేవాడు. సాయంత్రం తన బాకా మోత విని జనం గుళ్ళోకొచ్చేవారు. ఎంత ప్రయత్నించినా శబ్దం రావటం లేదు. గొంతులో రణం కోసేస్తున్నా వూపిరంతా పోసి బాకా వూదాడు. శబ్దం రాలేదు. దిగులుగా బాకా వైపు చూశాడు. గాలిగోపురం వైపు చూశాడు. శిఖరం వైపు చూశాడు. జమ్మి చెట్టుకి మారేడు చెట్టుకి మొక్కుకున్నాడు. శబ్దం రాలేదు. బాకా వూదని నా గొంతెందుకు? నా బతుకెందుకు? పక్కనే మోగని బాకా. తల మోకాళ్ళ మధ్య పెట్టుకుని కళ్ళు మూసుకున్నాడు.

నాల్గు దిక్కులూ వీళ్ళు చూస్తున్నారు. పంచభూతాలు వీళ్ళని చూస్తూనే ఉన్నాయి.

ఇవేమీ మనకక్కరలేదు.

రేవులో పందుల బురద!

చాకళ్ళ మురికి !

ఉప్పర్ల చెమట!

పైకి, పైపైకి సూర్యుడు!

చంద్రుడు, చుక్కల సరసం!

అంతా బాగానే వున్నట్టుంది! ❋